


నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

ఆంధ్రప్రదేశ్ (క్రిష్ణ) సోమవారం 06-07-2026 సంపుటి: 01 సంచిక : 2 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Andhrapradesh(Krishna) Monday, 06-07-2026 Volume :01 Issue: 2 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani






### గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో
## దిగజారిన భారత్

- 200 దేశాల్లో 125వ స్థానానికి భారత్
- ర్యాంకింగ్‌లో చలనశీలతతో పాటు జీవన నాణ్యత పరిగణన
- టాప్--10లో 9 యూరోపియన్ దేశాల హవా
- స్వీడన్‌కు అగ్రస్థానం.. అత్యధిక స్కోరు సాధన

**న్యూఢిల్లీ జూలై 5:(నేటి దర్శిని)**
గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్ (జీపీఐ) 2026లో భారత్ దిగజారింది. ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలలో భారత పాస్‌పోర్ట్ ర్యాంకు 125వ స్థానంలో నిలిచింది. దాదాపు పూర్తిగా వీసా రహిత ప్రవేశంపై దృష్టి సారించే సాంప్రదాయ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లకు భిన్నంగా, గ్లోబల్ సిటిజన్ సొల్యూషన్స్ రూపొందించిన గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్ మరింత సమగ్రమైన సమాచారం ఆధారంగా ర్యాంకులు కేటాయించింది. ఇందులో చలనశీలత, పెట్టుబడి, జీవన నాణ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ఏడాదికి సంబంధించి గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో యూరప్ మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ప్రపంచంలోని టాప్ 10 పాస్‌పోర్ట్‌లలో తొమ్మిది యూరోపియన్ దేశాలకు చెందినవి కావటం విశేషం. ఈ సంవత్సరం సూచికలో

-మిగతా 2 లో

### రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలను తరిమికొట్టడమే
# వైసీపీ పని!

**మేం కష్టపడి ప్రాజెక్టులు తీసుకువస్తే, తామే తెచ్చినట్లు సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారు**



- కూటమి తెచ్చిన ప్రాజెక్టులకు క్రెడిట్ కొట్టేస్తున్నారని ఆగ్రహం
- తమపై దుష్ప్రచారానికి సోషల్ మీడియాకు ఫండింగ్ చేస్తున్నారని ఆరోపణలు
- క్వాంటం, సెమీకండక్టర్ రంగాల్లో భారీ పెట్టుబడులకు ప్రయత్నాలు
- కుప్పం పర్యటనలో అభివృద్ధి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

**అమరావతి జూలై 5:(నేటి దర్శిని)**
రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలను తరిమికొట్టడమే పనిగా పెట్టుకున్నారని, కూటమి ప్రభుత్వం ఎంతో కష్టపడి తెస్తున్న ప్రతి ప్రాజెక్టును తామే తెచ్చినట్లు సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైసీపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా, ఇప్పుడు కూడా అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం వచ్చిన ఆయన, మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనపైనా, పవన్ కల్యాణ్ పైనా నిరంతరం దుష్ప్రచారం చేసేందుకు కొన్ని సోషల్ మీడియా గ్రూపులకు 'గొడ్డలి పార్టీ' నేతలు ప్రత్యేకంగా

-మిగతా 2 లో



## హే రామ్.. సేవ్ ఆంధ్రప్రదేశ్

- అత్యంత ప్రమాదకరధోరణిలో పోలీస్ యంత్రాంగం
- జర్నలిస్టులపై తీవ్రవాదుల చట్టాలా?
- గిరిజన మహిళని వివస్త్ర చేసినా.. పట్టించుకోరా
- సీబీఎన్ సర్కార్‌పై మాజీ సీఎం సంచలన ట్వీట్

**ఏపీ బ్యూరో జూలై 5:(నేటి దర్శిని)**
సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పోలీస్ యంత్రాంగం అత్యంత ప్రమాదకర ధోరణితో వ్యవహరిస్తోందని, చంద్రబాబు ప్రభుత్వం వ్యవస్థల్లో విష విత్తనాలు నాటుతోందని ఆయన ఆదివారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా సుదీర్ఘ ట్వీట్ చేశారు. రాజకీయ అణచివేత చర్యల కోసం, ప్రశ్నించేవారి గొంతు నొక్కడానికి ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను వాడుకుంటోందని మండిపడ్డారు.

**శాంతిభద్రతల వైఫల్యంపై తీవ్ర విమర్శలు**
రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైందని జగన్ ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి కనిపించకుండా పోయి 30 రోజులు దాటినా ఆచూకీ కనుగొనడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అలాగే పెద్దాపురంలో మానసిక దివ్యాంగురాలైన

-మిగతా 2 లో



## ఇరాన్‌కు మరోసారి ట్రంప్ హెచ్చరికలు

- మేం తలుచుకుంటే ఒక్క దెబ్బతో ఇరాన్ నేతలందరినీ చంపేవాళ్లం :
- 'చర్చలకు అవకాశం ఉండాలనే వదిలేశాం'
- ఖమేనీ అంత్యక్రియలపై ట్రంప్ వ్యాఖ్యలు
- 'ప్రజలు మొసలి కన్నీరు కార్చి ఉండొచ్చు'

2 లో

## నిరుద్యోగ యువతకు శుభవార్త

- త్వరలో భారీ స్థాయిలో పోలీస్ ఉద్యోగాల భర్తీ
- మొత్తం 7,437 పోస్టులకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధం
- నోటిఫికేషన్ విడుదల చేసేందుకు తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాట్లు

**హైదరాబాద్**
తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు శుభవార్త తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు త్వరలో భారీ స్థాయిలో పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 7,437 పోస్టులకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను సిద్ధం చేసినట్లు బోర్డు చైర్మన్ వెల్లడించారు. ఈ నియామకాల్లో 3,697 సివిల్ కానిస్టేబుల్ పోస్టులు, 1,052

-మిగతా 2 లో

### స్వాతంత్ర్యం
# మా హక్కు

**పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఆందోళనలు..**

- 27వ రోజుకు చేరిన పీవోకే ప్రజల ఉద్యమం
- జేఏఏసీ నేత సహా 600 మందిపై అరెస్టులు
- విడుదల కోరుతూ మరింత ఉధృతమైన నిరసనలు
- 'స్వాతంత్రం కావాలి.. లేదంటే భారత్‌లో విలీనం' నినాదాలు
- అణచివేత ఆరోపణల మధ్య కొనసాగుతున్న ఆందోళనలు



**న్యూఢిల్లీ జూలై 5:(నేటి దర్శిని)**
స్వాతంత్రం తమ హక్కు అని, పాకిస్తాన్ ప్రభుత్వం నుంచి స్వాతంత్రం కోరుకుంటున్నామని పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని పౌరులు నినదిస్తున్నారు. పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొంతకాలంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో ప్రజలు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆందోళనలు 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ క్రమంలో నిరసనకారులు తమ ఆందోళనలను మరింత ఉధృతం చేశారు. పీవోకేలో ఆందోళనలు చేస్తున్న జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) నాయకుడు షౌకత్ నవాజ్ మీర్‌తోపాటు మరో 600 మంది ఉద్యమకారులను, పౌరహక్కుల

-మిగతా 2 లో

## హెర్మూజ్'లో ఇరాన్ సర్వీస్ ఫీజు..

- అండగా నిలిచిన దేశాలకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటన
- ఒమన్‌తో కలిసి సముద్ర రవాణా ఏర్పాట్లు
- 'ఇది టోల్ కాదు.. సేవలకు మాత్రమే రుసుము'
- అమెరికా షరతుల మధ్య ఇరాన్ తాజా ప్రకటనతో చర్చ

2 లో



### "ఆంధ్రప్రదేశ్‌కు కొరియా దిగ్గజ
# కంపెనీలు




**దక్షిణ కొరియాలో భారత రాయబారితో మంత్రి నారా లోకేష్ భేటీ**

- ఏపీ ఎలక్ట్రానిక్స్, చిప్ కంపెనీలను ఆకర్షించేందుకు సహకరించాలని విజ్ఞప్తి
- శ్రీసిటీలో 'కొరియా ఎన్‌క్లేవ్' ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామన్న లోకేష్
- అనంతపురం ఆటో క్లస్టర్ విస్తరణ, గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ పై చర్చ
- ఏపీ-కొరియా డెస్క్ ఏర్పాటు చేస్తామని వెల్లడి
- సియోల్‌లో నారా లోకేష్ కీలక భేటీ

**, అమరావతి జూలై 5:(నేటి దర్శిని)**
ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ తన దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సియోల్‌లో భారత రాయబారి గౌరంగాళ్ దాస్‌తో ఆదివారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, కొరియన్ ఎలక్ట్రానిక్స్, చిప్ కంపెనీలను ఏపీకి ఆకర్షించేందుకు చొరవ చూపాలని రాయబారిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. శాంసంగ్, ఎల్‌జీ, ఎస్కే హైనిక్స్ వంటి

-మిగతా 2 లో




## భారీ వర్షాలతో ముంబయి అస్తవ్యస్తం..

- దేశ వాణిజ్య రాజధాని అతలాకుతలం
- కుర్లాలో చెట్టు కూలి వృద్ధుడి మృతి
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. మెట్రో సహా రవాణాకు అంతరాయం
- పలు విమానాలు రద్దు, మరికొన్ని దారి మళ్లింపు
- రెడ్ అలర్ట్ జారీ.. రన్‌వే కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేత

**ముంబయి**
: దేశ వాణిజ్య రాజధాని ముంబయిని భారీ వర్షాలు, ఈదురుగాలులు అతలాకుతలం చేస్తున్నాయి. దీంతో ఆది వారం ఇండిగోకు చెందిన నాలుగు విమానాలు రద్దు కాగా వివిధ సంస్థలకు చెందిన 13 ల్యాండింగ్ విమానాలను సమీపంలోని విమా నాశ్రయాలకు దారి మళ్లించామని అధికారిక వర్గాలు చెప్పాయి. అవి సురక్షితంగా ముంబయిలోనే ల్యాండ్ అయ్యాయని వివరించాయి. భారీ వర్షాలతో ముంబయిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనితో వాహనాల రాకపోకలు స్తంభించా యి. మెట్రో మార్గాల్లోనూ అంతరాయం

-మిగతా 2 లో



## తీరం దాటిన వాయుగుండం

- ఉత్తర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వైపుగా పయనం.. నేడు కోస్తాలో వర్షాలు
- కోస్తాంధ్ర ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక
- తీరం వెంబడి బలమైన గాలులు
- సముద్రంలోకి వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక
- నేడు కోస్తాలో మోస్తరు వర్షాలు

**విశాఖపట్నం, అమరావతి, జూలై 5:(నేటి దర్శిని)**
నైరుతి రుతుపవనాల సీజన్‌లో మొదటి రుతుపవన వాయుగుండం ఆదివారం ఉదయం ఏర్పడి.. రాత్రికి ఒడిశాలో తీరం దాటింది. రెండు రోజుల క్రితం ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ఆనుకొని వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, శనివారం తీవ్ర అల్పపీడనంగా బలపడిన విషయం తెలిసిందే. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి ఆదివారం ఉదయానికి వాయుగుండంగా మారింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి ఆదివారం రాత్రి 8 గంటల తర్వాత ఒడిశాలోని బాలాసోర్‌కు సమీపంలో తీరం దాటింది. ఇది ప్రస్తుతానికి బాలాసోర్‌కు సుమారు 50కి.మీ, కియోంఝర్‌గఢ్ (ఒడిశా)కు 100 కి.మీ, జంషెడ్‌పూర్(జార్ఖండ్)కు 140 కి.మీ.దూరంలో ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే 24 గంటల్లో ఉత్తర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తుందని పేర్కొన్నారు. వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కోస్తాంధ్ర తీరం వెంబడి

-మిగతా 2 లో

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

## గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో
# దిగజారిన భారత్

మొదటి తరువాయి

10 అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌లు.. స్వీడన్, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్, జర్మనీ, డెన్మార్క్ (ఉమ్మడి), నెదర్లాండ్స్ (ఉమ్మడి), ఐర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), నార్వే, సింగపూర్ దేశాల నుంచి ఉన్నాయి. అత్యుత్తమ ప్రదర్శనతో స్వీడన్ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా నిలిచింది. చలనశీలతలో ప్రపంచవ్యాప్తంగా 11వ స్థానంలో ఉన్నప్పటికీ, పెట్టుబడిలో తొమ్మిదవ స్థానంలో, జీవన నాణ్యతలో రెండో స్థానంలో నిలిచి.. అత్యధిక మొత్తం స్కోరును సాధించింది.

# ఇరాన్‌కు మరోసారి ట్రంప్ హెచ్చరికలు

-మేం తలుచుకుంటే ఒక్క దెబ్బతో ఇరాన్ నేతలందరినీ చంపేవాళ్లం :
-'చర్చలకు అవకాశం ఉండాలనే వదిలేశాం'
-ఖమేనీ అంత్యక్రియలపై ట్రంప్ వ్యాఖ్యలు
-'ప్రజలు మొసలి కన్నీరు కార్చి ఉండొచ్చు'



న్యూఢీల్లి
ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి హెచ్చరికలు చేశారు. తాము అనుకుంటే ఖమేనీ అంత్యక్రియల ప్రారంభ కార్యక్రమంలోనే అక్కడున్న నాయకులందరినీ ఒక్కదెబ్బతో చంపేవాళ్లమని వ్యాఖ్యానించారు. కానీ తమతో చర్చలు జరపడానికి ఎవరూ ఉండరనే కారణంతో వారిని వదిలేశామని అన్నారుఆ దేశంలో మిగిలిన నాయకత్వాన్ని తాను నిర్మూలించగలనని, కానీ అలా చేయాలని తాను అనుకోవట్లేదని చెప్పారు. ఖమేనీ అంత్యక్రియల్లో వేలాది మంది ఇరానియన్లు కన్నీరు పెట్టుకోవడంపై ట్రంప్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఆ దేశ ప్రజలు ఖమేనీని ద్వేషిస్తున్నారని ఇంతకాలం తాను అనుకున్నట్లు తెలిపారు. తాను అనుకున్నదే నిజమై ఉండొచ్చని.. అంత్యక్రియల సమయంలో ప్రజలు మొసలి కన్నీరు కార్చి ఉంటారని వ్యాఖ్యానించారు.

# నిరుద్యోగ యువతకు శుభవార్త

మొదటి తరువాయి

ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ పోస్టులు, 1,380 స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయనున్నారు. అలాగే 148 సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అంతేకూండా జైల్ వార్డెన్, ఫైర్ డిపార్ట్‌మెంట్ వార్డెన్ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా ఇదే ప్రక్రియలో విడుదలయ్యే అవకాశం ఉందని బోర్డు చైర్మన్ తెలిపారు. దీంతో పోలీస్, జైల్, ఫైర్ సర్వీసుల్లో ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులకు ఇది మంచి అవకాశంగా మారనుంది. ప్రస్తుతం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధంగా ఉండగా, ప్రభుత్వ అనుమతులు పూర్తయిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అర్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం, పరీక్ష తేదీలు, దరఖాస్తు ప్రక్రియ వంటి పూర్తి వివరాలను అధికారిక ప్రకటనలో వెల్లడించనున్నారు.

# హెర్ముజ్‌'లో ఇరాన్ సర్వీస్ ఫీజు..

-అండగా నిలిచిన దేశాలకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటన
-ఒమన్‌తో కలిసి సముద్ర రవాణా ఏర్పాట్లు
-'ఇది టోల్ కాదు.. సేవలకు మాత్రమే రుసుము'
-అమెరికా షరతుల మధ్య ఇరాన్ తాజా ప్రకటనతో చర్చ



టెహ్రాన్
హెర్ముజ్ జలసంధిలో నౌకలపై సేవా రుసుము వసూలు చేసేందుకు ఇరాన్ ప్లాన్ చేస్తోందని ఆ దేశ రాయబారి అబ్దుల్‌రెజా రెహమాన్ ఫాజ్లి కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా రాజధాని బీజింగ్‌లో శనివారం జరిగిన ప్రపంచ శాంతి సదస్సులో ఆయన మాట్లాడుతూ.. యుద్ధ సమయంలో ఇరాన్‌కు అండగా నిలిచిన దేశాలకు మాత్రం సేవా రుసుములో ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్టు చెప్పారు. ఒమన్‌తో కలిసి ఇరాన్ హెర్ముజ్‌లో నౌకల రవాణాపై ఏర్పాట్లు చేస్తోందన్నారు. 'హెర్ముజ్ మా దేశంలో అంతర్భాగం. కాబట్టి మేం కచ్చితంగా సేవా రుసుము వసూలు చేస్తాం.ఇది టోల్ కాదు. జలసంధి గుండా నౌకలు సులభంగా వెళ్లేందుకు చేస్తున్న ఏర్పాట్లకు, ట్రాఫిక్‌ను నియంత్రించినందుకు మేం తీసుకుంటున్న సర్వీస్ ట్యాక్స్' అని అబ్దుల్ వెల్లడించారు. హెర్ముజ్‌లో ఎలాంటి టోల్ వసూలు చేయొద్దని అమెరికా షరతు పెట్టినా సరే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారాయి. 60 రోజుల పాటు ఎలాంటి టోల్ వసూలు చేయొద్దని ఇరాన్-యూఎస్ ఒప్పందంలో ఉంది. ఆ తర్వాత ఏమైనా ట్యాక్సులు ఉంటాయా అని ప్రపంచం ఆందోళన చెందుతున్న వేళ.. అబ్దుల్ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

# రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలను తరిమికొట్టడమే వైసీపీ పని!

మొదటి తరువాయి





నిధులు సమకూరుస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. హింస, అసత్యత, వర్గవిభేదాలు, రౌడీయిజం వంటి వాటినే ఆ పార్టీ నమ్ముకుందని, వారి అడ్డంకులు ఎన్ని ఎదురైనా రాష్ట్రంలో అభివృద్ధి మాత్రం ఆగదని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గానికి మునుపెన్నడూ చూడని రీతిలో ప్రాజెక్టులు వస్తున్నాయని, రోడ్లు, కమ్యూనికేషన్ సహా అన్ని రంగాల్లో కనెక్టివిటీ పెంచుతున్నామని తెలిపారు. త్వరలోనే అభివృద్ధి చెందిన సరికొత్త కుప్పాన్ని ప్రజలు చూస్తారని భరోసా ఇచ్చారు. వికేంద్రీకృత అభివృద్ధి విధానంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రానికి క్వాంటం, సెమీ కండక్టర్ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం వివరించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది డిసెంబర్ నాటికి అమరావతిలో "క్వాంటం కంప్యూటింగ్ సెంటర్" కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. ఇంధన రంగంలో సౌర, పవన్ విద్యుత్‌తో పాటు ఇతర అత్యాధునిక విధానాలను అమలు చేస్తున్నామన్నారు. దేశంలోని ప్రముఖ ఉక్కు పరిశ్రమలైన ఆర్సెలర్ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ వంటి సంస్థలు ఏపీలో తమ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నాయని గుర్తుచేశారు. పరిశ్రమలతో పాటు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. గత పాలకులు విలువైన భూములు, ఖనిజ సంపదను ఒకే వ్యక్తి ప్రయోజనం కోసం కట్టబెట్టారని, ఏజెన్సీ ప్రాంతాలను గంజాయి సాగుకు కేంద్రంగా మార్చారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తిరుమల ప్రసాదాన్ని సైతం కల్తీ చేశారని, అలాంటి వారు ఇప్పుడు నీతులు చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

# హే రామ్.. సేవ్ ఆంధ్రప్రదేశ్

మొదటి తరువాయి



బాలికపై లైంగిక దాడి ఘటనలో కేసు నమోదుకు తాత్సారం చేసి నిందితులతో కుమ్మక్కయ్యారని విమర్శించారు. నెల్లూరు జిల్లా కావలిలో గిరిజన మహిళను వివస్త్ర చేసి దాడి చేసిన ఘటనలో వారం రోజుల తర్వాత ఫిర్యాదు తీసుకోవడమే కాకుండా, బాధితులపైనే ఎదురు కేసులు పెట్టడం దారుణమన్నారు. సాయికృష్ణ లాకప్ డెత్, క్రాంతికుమార్ ఆత్మహత్య, గంగమ్మ, తిరుపతమ్మ లాకప్‌డెత్ ఘటనలు పోలీసు వ్యవస్థకు తీవ్ర తలవంపులు తెచ్చాయని పేర్కొన్నారు.
సోషల్ మీడియా యాక్టివిస్టులపై వేధింపులు
ఈ దారుణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి చంద్రబాబు రోజుకో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని జగన్ విమర్శించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై బెయిల్ రాని సెక్షన్లు పెట్టాలని, కేసులను వ్యవస్థీకృత నేరాలతో లింక్ చేయాలంటూ ఒక ఆర్గనైజ్డ్ క్రిమినల్ మాదిరిగా ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఆదేశాలు పంపడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. చట్టపరమైన నిబంధనలు పాటించకుండా యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్ కేవీఆర్‌ను హైదరాబాద్ నుంచి అరెస్ట్ చేయడం, యూట్యూబర్ రావన్‌కు కోర్టుల్లో బెయిల్ వచ్చినా పోలీస్ స్టేషన్‌పై దాడులు చేయించి తీవ్రవాద అభియోగాలు మోపడం దుర్మార్గమన్నారు. గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్ మాట్లాడిన మాటలనే ఇప్పుడు వారు ప్రశ్నిస్తున్నారని గుర్తుచేశారు. "ఆంధ్రప్రదేశ్‌కు కావాల్సింది రౌడీ పోలీస్ రాజ్యం కాదు, జంగిల్ రాజ్ కాదు. ప్రజలకు భద్రత కల్పించే పాలన కావాలి. బాధితులకు న్యాయం చేసే వ్యవస్థ, రాజ్యాంగానికి లోబడి నడిచే పోలీస్ వ్యవస్థ కావాలి. హే రామ్.. సేవ్ ఆంధ్రప్రదేశ్" అంటూ జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు."

# స్వాతంత్రం మా హక్కు

మొదటి తరువాయి

నేతలను ప్రభుత్వం అరెస్టు చేసింది.దీంతో వీరందరినీ విడుదల చేయాలని కోరుతూ జేఏఏసీ ఆధ్వర్యంలో మరింత భారీగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అనేక ప్రాంతాల్లో వేలాదిగా ఆందోళనకారులు నిరసన చేశారు. పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అక్రమంగా అరెస్టు చేసిన తమవారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో పాకిస్తాన్ పాలన నుంచి తమకు విముక్తి కావాలంటూ నిరన చేపట్టారు. లేకుంటే ఇండియాతో తమను మళ్లీ కలపాలని కోరుతున్నారు. ఇండియా నుంచి మానవతా సాయం, ఆహార సరఫరా కూడా అందుతుందని ఆందోళనకారులు అంటున్నారు. ఈ ఆందోళనల్లో పిల్లలు, యువత, మహిళలు సహా అందరూ పాల్గొంటున్నారు. ఇస్లామాబాద్ ప్రభుత్వం తమను ఇన్నాళ్లుగా దోపిడీకి గురి చేసిందని విమర్శించారు. స్వతంత్రం తమ హక్కు అని, తమకు స్వతంత్రం ఎందుకు ఇవ్వరు అని ప్రశ్నించారు. తాము కోల్పోయిన స్వాతంత్ర్యాన్ని వెనక్కి తీసుకుంటామన్నారు.మరోవైపు ఆందోళనలపై పాక్ ప్రభుత్వం అణచివేసే చర్యలు చేపట్టే అవకాశం ఉన్నందున ఉద్యమకారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. భద్రతా దళాల నుంచి ఎటువంటి ప్రతిఘటనా లేకుండా.. మహిళలు, పిల్లలు, వృద్ధులు ఆందోళనల్లో ముందు వరుసలో ఉంటున్నారు. ఇంకోవైపు ఆందోళనల్ని అణచివేసేందుకు పాక్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే పాక్ పోలీసులు, భద్రతా దళాలు జరిపిన దాడుల్లో 58 మంది పౌరులు మరణించినట్లు అంచనా. అయితే, అంతకంటే ఎక్కువ మందే మృతులు ఉంటారని స్థానికులు అంటున్నారు. దాదాపు నెల రోజులుగా పీవోకేలో ఆందోళనలు ఉధృతంగా కొనసాగుతున్నాయి.

# భారీ వర్షాలతో ముంబయి అస్తవ్యస్తం..

మొదటి తరువాయి

ఏర్పడింది. ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. సముద్రపు అలలు 4.19 మీటర్ల ఎత్తున ఎగసిపడే అవకాశం ఉందని హెచ్చరించింది. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజల కోసం 1916 హెల్ప్‌లైన్ నంబర్‌ను బీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు.భారీ వర్షాలు, ఈదురు గాలులతో ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సిన 90 శాతం విమానాలు గంటకు పైగా ఆలస్యంగా నడుస్తున్నాయి. రావాల్సిన విమానాల్లో 45 శాతం ఆలస్యంగా నడుస్తున్నాయి. దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదానీ గ్రూప్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సంయుక్తంగా ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరు విమానాశ్రయ అధికారులు ఇవాళ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఉదయం సుమారు 10.17 గంటల సమంయలో గంటకు 42 నాట్స్ వేగంతో వీచిన బలమైన గాలులు, భారీ వర్షం కారణంగా విజిబిలిటీ తగ్గింది. ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రన్వే కార్యకలాపాలు ప్రభావం చూపాయి. నియమ, నిబంధనల ప్రకారం, ప్రయాణికులు, విమానాలు, గ్రౌండ్ సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకొని రన్వే కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశాం" అని వివరించారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత, ఒక గంట వ్యవధిలోనే రన్‌వేపై సాధారణ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమైనట్టు వారు తెలిపారు.

# తీరం దాటిన వాయుగుండం

మొదటి తరువాయి

గంటకు 45 నుంచి 55 కి.మీ.ల వేగంతో ఈదురు గాలులు వీస్తుండంతో మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం, అమరావతిలోని విపత్తుల నిర్వహణ సంస్థలు హెచ్చరించాయి. వాయుగుండం ప్రభావంతో సముద్రంలో రుతుపవన కరెంట్ బలంగా ఉందని పేర్కొంటూ కోస్తాంధ్రలో అన్ని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతాసూచిక ఎగురవేశారు. ఆదివారం ఉదయం వరకు ఉత్తర కోస్తాలో చిరుజల్లులు కురిసిన తరువాత ఆకాశం మేఘావృతమై ఉంది. రాత్రి నుంచి సోమవారం ఉదయం ఎనిమిది గంటల వరకు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ వర్షం కురుస్తుందని, కోస్తాలోని మిగిలిన ప్రాంతాలు, రాయలసీమలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది.

# "ఆంధ్రప్రదేశ్‌కు కొరియా దిగ్గజ కంపెనీలు

మొదటి తరువాయి




దిగ్గజ సంస్థలను రాష్ట్రానికి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0కు అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇందుకోసం శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి, విశాఖపట్నంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన 'రెడీ టు యూజ్' క్లస్టర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీ, ఆంధ్రా విశ్వవిద్యాలయం వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలతో కలిసి పీఎల్ఎస్ఈ, ప్యాకేజింగ్, డిస్‌ప్లే టెక్నాలజీస్ వంటి రంగాల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్ భారత పర్యటన సందర్భంగా ప్రతిపాదించిన 'కొరియా ఎన్‌క్లేవ్' ఏర్పాటుకు శ్రీసిటీలో ప్లగ్-అండ్-ప్లే టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేసేందుకు ఏపీ సిద్ధంగా ఉందని లోకేష్ తెలిపారు. ఇది కొరియన్ చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతపురంలోని కియా, హ్యుందాయ్ మోబిస్ ఆటో-ఈవీ క్లస్టర్లను మరింత విస్తరించడం, ఏపీ తీరంలో హెచ్‌డీ హ్యుందాయ్ తరహాలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ నిర్మాణం, బ్యాటరీలు, గ్రీన్-హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఏపీ, కొరియా మధ్య పారిశ్రామిక సంబంధాలను బలపాతం చేసేందుకు కొరియా ప్లస్, కోట్రా (కేటీఆర్ఏ) వంటి సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఒక ప్రత్యేక 'ఏపీ-కొరియా డెస్క్' ఏర్పాటు చేయనున్నట్లు లోకేష్ వెల్లడించారు. ఈ నెల 10న సియోల్‌లో నిర్వహించనున్న ఇన్వెస్టర్ రోడ్‌షో విజయవంతం అయ్యేలా, కీలక ఒప్పందాలు కుదిరేలా సహకరించాలని భారత రాయబారిని కోరారు."

## రామాలయంలో నూతన షెడ్డు నిర్మాణానికి రూ.5.50 లక్షలు విరాళం








**నంద్యాల ప్రతినిధి, జూలై 5:(నేటి దర్శిని)**
నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ కోదండ రామాలయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త గోళ్ళ రాజేష్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయం ఆవరణంలో భక్తుల సౌకర్యార్థం రూ.5.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న నూతన షెడ్డు నిర్మాణానికి భూమి పూజ నిమిత్తం హాజరైన గోళ్ళ రాజేష్ కు భగవత్ సేవా సమాజ్ పాలకమండలి కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో పండితుల వేద మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక ఆశీర్వచనాలు పలికిన అనంతరం స్వామి చిత్రపటం, శేష వస్త్రాలను ఆయనకు అందజేశారు. అలాగే భూమి పూజ, పంచలోహ, నవరత్న సమర్పణలతో అర్చకులు విశేష పూజలు చేశారు. పూజల అనంతరం రాజేష్ కు ప్రత్యేక పూలమాల, స్వామి శేష వస్త్రాలతో పాటు కిరీటిధారణ నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఆ భగవంతుడి ఆశీర్వాదం ఆయనకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

## దీర్ఘకాలిక సమస్యలపై మంత్రికి వినతి పత్రం







**నంద్యాల ప్రతినిధి, జూలై 5:(నేటి దర్శిని)**
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ కు నాయకులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి వివిధ సమస్యలపై మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ అన్ని అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తామని నేతలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ నాయకులు లక్ష్మీనరసిరెడ్డి, రామ్ విజయ రెడ్డి, వై ఎన్ వి ప్రసాద్, మణి శేఖర్ రెడ్డి, రాబిన్ ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్ (ఎస్ టి యు), ఏపీటిఎఫ్ నాయకుడు రామచంద్రారెడ్డి, యూటీఎఫ్ నేత పివి ప్రసాద్, శివరాం, పి ఆర్ టి యు నాయకులు భాస్కర్ రెడ్డి, గోవిందు, నారాయణ, జగదీశ్వరప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఇమాముల సంఘం నేతలు









**నంద్యాల ప్రతినిధి, జూలై 5:(నేటి దర్శిని)**
పవిత్ర ఉమ్రాయాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని నంద్యాలకు చేరుకున్న రాష్ట్ర మంత్రి ఫరూక్, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ లను ఇమాముల సంఘం నేతలు ఆదివారం స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి ఆత్మీయతను చాటుకున్నారు. అల్లాహ్ కృపతో వారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని, మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు విశేష సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నేతలు హాఫీజ్ అంజద్ బాషా సిద్ధికి, మౌలానా మహబూబ్ బాషా, హాఫీజ్ అబ్దుల్ సలాం, మౌలానా ఇమ్రాన్, హాఫీజ్ షాబుద్దీన్, హాఫీజ్ మన్సూర్, హాఫీజ్ అబ్దుల్ రెహమాన్, హాఫీజ్ ఖాజా, హాఫీజ్ రజాక్, మసీదు ఇమాముల సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు బయటపెడితే... బెదిరింపులా...?

- చిట్వేలి ఐసీడీఎస్‌లో వింత పరిస్థితి
- చెడిపోయిన పాలపై వార్త ప్రచురించారనే ఆగ్రహం
- సంబంధం లేని వ్యక్తుల నుంచి విలేకరికి ఫోన్ కాల్స్..
- కేసులు పెడతామంటూ హెచ్చరికలు



**చిట్వేలి, జూలై 5: జూలై 5:(నేటి దర్శిని)**
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం పాత్రికేయుల రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై మీడియా ప్రశ్నిస్తే, సంబంధిత అధికారులు వివరణ ఇవ్వడం పరిపాలనా బాధ్యత. అయితే చిట్వేలి ఐసీడీఎస్ ప్రాజెక్టులో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంగన్వాడీ కేంద్రాలకు చెడిపోయిన పాలు, నాణ్యతలేని కోడిగుడ్ల సరఫరాపై వార్త ప్రచురితమైన అనంతరం, సమాధానం ఇవ్వాల్సిన కొందరు అధికారులు వివరణ ఇవ్వకుండా సంబంధిత విలేకరితో ఫోన్‌లో తీవ్ర స్వరంతో మాట్లాడినట్లు సమాచారం. అంతేకాకుండా, ఐసీడీఎస్‌కు సంబంధం లేని వ్యక్తుల ద్వారా కూడా ఒక విలేఖరికి ఫోన్ కాల్స్ చేయించి హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆడియో రికార్డులు ఉన్నట్లు సమాచారం.

**సమాధానం చెప్పాల్సింది పోయి... హెచ్చరికలా..?**
విశ్వసనీయ సమాచారం ప్రకారం, వార్త ప్రచురితమైన కొద్దిసేపటికే ఒక విలేకరికి వరుస ఫోన్ కాల్స్ వచ్చాయి. ఆ సంభాషణల్లో "మేమంటే ఏమిటో తెలుసా... మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు... మా బ్యాక్‌గ్రౌండ్ తెలుసుకోండి... అవసరమైతే కేసులు పెట్టి ఇబ్బంది పెడతాం..." అనే తరహా వ్యాఖ్యలు వినిపించినట్లు సమాచారం. అలాగే "పత్రికా విలేకరులంతా లంచగొండులే..." వంటి వ్యాఖ్యలు కూడా చేసినట్లు తెలుస్తోంది.
ఈ వ్యాఖ్యలు ప్రజా సమస్యపై సమాధానం ఇచ్చే ప్రయత్నంగా కాకుండా, వార్త ప్రచురించిన వ్యక్తిపైనే ఇందుకు సంబంధంలేని బయటి వ్యక్తులతో ఒత్తిడి తీసుకురావాలనే ధోరణిని ప్రతిబింబిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**అసలు సమస్యపై మౌనం ఎందుకు..?**
అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అయిన పాలు ఎందుకు చెడిపోయాయి? చిన్నారులకు పంపిణీ చేసిన కోడిగుడ్ల నాణ్యతపై ఎలాంటి పర్యవేక్షణ జరిగింది? ప్రజలు సమాధానం కోరుతున్న ప్రశ్నలు ఇవి. అయితే ఈ అంశాలపై స్పష్టత ఇవ్వడం బదులుగా "పాలు చెడిపోతే మాకు సంబంధం లేదు... కోడిగుడ్లు చిన్నగా వస్తే మేమేం చేస్తాం... అవసరమైతే అంగన్వాడీ కార్యకర్తలపైనే చర్యలు తీసుకుంటాం..." అనే వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.
దీంతో అసలు సమస్యను పక్కనబెట్టి, బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందిపై మళ్లించే ప్రయత్నం జరుగుతోందా అనే సందేహాలు వ్యక్తమవు తున్నాయి.


**సంబంధం లేని వ్యక్తులు రంగంలోకి**
ఈ ఘటనలో మరో ఆసక్తికర అంశం కూడా వెలుగులోకి వచ్చింది. అధికారికంగా స్పందించాల్సిన వారు కాకుండా, ఐసీడీఎస్‌తో సంబంధం లేని వ్యక్తులు కూడా ఆ విలేకరితో మాట్లాడి హెచ్చరికలు చేసినట్లు తెలిసింది. అధికారిక వ్యవహారంలో బయటి వ్యక్తుల ప్రమేయం ఎందుకు వచ్చింది? ఎవరిపేరుతో, ఏ హోదాలో వారు మాట్లాడారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
అధికారిక వివరణ ఇవ్వాల్సిన చోట, సంబంధం లేని వ్యక్తులు ఫోన్‌లో జోక్యం చేసుకోవడం పరిపాలనా వ్యవస్థపై అనేక అనుమానాలకు తావిస్తోంది.

**ప్రాజెక్టులో ఇదే మొదటిసారి కాదా..?**
చిట్వేలి ఐసీడీఎస్ ప్రాజెక్టులో గతంలో కూడా అంగన్వాడీ వర్కర్లు, ఆయాలపై ఒత్తిళ్లు, వర్గాలుగా విభజించి వ్యవహరించడం, ప్రశ్నించిన వారిపై తనిఖీలు, మెమోలు, వివరణలు కోరడం వంటి ఆరోపణలు వినిపించాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. కొందరికి ఒక విధానం, మరికొందరికి మరో విధానం అమలవుతోందనే అసంతృప్తి కూడా వ్యక్తమవుతోంది.
ఈ తాజా ఘటనతో ఆ ఆరోపణలు మరోసారి చర్చకు వచ్చాయి.

**ఉన్నతాధికారుల విచారణ చేయాలి**
ప్రజారోగ్యానికి సంబంధించిన అంశంపై వచ్చిన వార్తకు వివరణ ఇవ్వకుండా, ఆ వార్త రాసిన విలేకరితో తీవ్ర స్వరంలో మాట్లాడిన ఘటన, సంబంధం లేని వ్యక్తుల జోక్యం, కేసుల హెచ్చరికల ఆరోపణల నేపథ్యంలో ఈ పరిణామాలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమని, అలాంటి ప్రశ్నలపై పారదర్శకంగా స్పందించడం వల్లే ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.


## శానిటేషన్ వైఫల్యం.. స్థానికుల ఆగ్రహం..

**పాయకాపురంలో దుర్వాసనతో జనం ఆగ్రహం..**
**సైడ్ కాల్వపై శానిటేషన్ వైఫల్యం ఆరోపణలు**
**చెత్తతో నిండిన కాల్వ..**
**దోమలు, ఈగలతో ప్రజలకు ఇబ్బందులు**



**పాయకాపురం జూలై 5:(నేటి దర్శిని)**
స్థానిక 61వ డివిజన్ ప్రాంతంలోని ప్రధాన సైడ్ కాల్వలో చెత్త వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. ఈ వ్యర్ధాలపై ఈగలు దోమలు ఆవాసాలుగా మారి ఉన్నాయి. ఈ వ్యర్థాల వలన దుర్గంధం వెదజల్లుతున్నాయి ఈ ప్రాంతంలో మాంస చేపల దుకాణాలు ఉండటంవల్ల వాటి వ్యర్థాలను కాలవలో పడవేయడం వలన సైడ్ కాలవలో అవి పేరుకుపోయి రకరకాల క్రిమి కీటకాలకు ఆవాసాలుగా మారాయి. వీటి వలన పలు రోగాలు వ్యాప్తి చెందుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.ఇది ఎలా ఉంటే సైడ్ కాలంలో మురుగు తీయడం లేదని స్థానికుల వాదనగా ఉంది సంబంధిత శానిటేషన్ వైఫల్యం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. నున్న నూజివీడు వెంబడి ప్రధాన సైడ్ కాలవలో మురుగునీరు అదోరకమైన రంగుతో కనబడుతున్నది. జంతు వ్యర్థాలు కావులో మాంస దుకాణ వ్యాపారులు వేయడం వలన ఈ రంగు కు మురుగునీరు వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. పేరుకు మాత్రమే స్వచ్ఛ్ ఆంధ్ర పరిసరాలు పరిశుభ్రత అని శానిటేషన్ అధికారులు బిల్డప్ ఇస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కనకదుర్గమ్మ ఆలయానికి రూ.5 లక్షలకు పైగా విరాళాలు




**ఇంద్రకీలాద్రి జూలై 5:(నేటి దర్శిని)**
విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ నిత్య అన్నదాన, ఆలయ అభివృద్ధి నిధులకు పలువురు భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో రూ.5,00,232 విరాళాలు సమర్పించారు. తిరువూరుకు చెందిన వి.వి. మనుబ్రహ్మాచారి రూ.1,00,116, ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన కంచర్ల బెనర్జీ కుటుంబ సభ్యులు రూ.1,00,116, విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడకు చెందిన వై. యోహిత్ రూ.1,00,000, హైదరాబాద్ సరూర్‌నగర్‌కు చెందిన వి. వీరప్రకాష్ కుటుంబ సభ్యులు రూ.1,00,000లను ఆలయ నిత్య అన్నదాన విభాగానికి విరాళంగా అందజేశారు. అలాగే చిత్తూరు జిల్లా మదనపల్లి ప్రశాంతి నగర్‌కు చెందిన ఇందుకూరి నరేష్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి నిధికి రూ.1,00,000 విరాళం సమర్పించారు. ఈ విరాళాలను ఆలయ చైర్మన్ బొర్రా గాంధీ అధికారులు, అర్చకుల సమక్షంలో భక్తిపూర్వకంగా అందజేశారు.

# మంచుగడ్డ పై మైనపు బొమ్మ

**-స్కేటింగ్ క్రీడాకారిణి చైత్ర దీపికను అభినందించిన ఎమ్మెల్యే సుజన చౌదరి..**



**భవానిపురం, జూలై 5:(నేటి దర్శిని)**
నేషనల్ ఐస్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి పెదిరెడ్ల చైత్ర దీపిక ను ఎమ్మెల్యే సుజన చౌదరి అభినందించి ఆశీస్సులు అందజేశారు. డెహ్రాడూన్ వేదికగా జూన్ 25వ తేదీ నుండి 30వరకు వరకు జరిగిన 21వ నేషనల్ ఐస్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించి కేటగిరీ-7 విభాగంలో తన అత్యుత్తమ ప్రదర్శనతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. తన అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో రాణించిన చైత్ర దీపిక రాష్ట్రానికి, అలాగే తన జిల్లాకు విశేషమైన గౌరవాన్ని తీసుకొచ్చింది. ఈ విజయంతో ఆమె ఇప్పటివరకు ఆర్టిస్టిక్ స్కేటింగ్, ఐస్ స్కేటింగ్ విభాగాల్లో ఏకంగా 62 పతకాలను సాధించి తన సత్తా చాటింది. ఈ సందర్భంగా ఆదివారం తాడిగడప లోని ఎమ్మెల్యే సుజన చౌదరిను కాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తాను సాధించిన విజయాలను తెలియజేసింది. రానున్న రోజుల్లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించి దేశానికి, రాష్టానికి మంచి పేరు తేవాలని విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని ఎమ్మెల్యే సుజన చౌదరి అభినందించి ఆశీస్సులు అందజేశారు.



## గత్తరలేపిన రెజీనా కాసాండ్రా..

### అమ్మడి ఫోటోలకు ఫిదా అవ్వాల్సిందే..

రెజీనా కాసాండ్రా.. ఈ అందాల భామ ఒకానొక సమయంలో టాప్ హీరోయిన్ గా రాణించింది. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగు, తమిళం,కన్నడ సినిమాల్లో నటిస్తూ అలరిస్తుంది. ఈ ముద్దుగుమ్మ 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. చిన్న వయస్సులోనే సినిమా రంగంలోకి అడుగుపెట్టిన రెజీనా, 2005లో తమిళ చిత్రం "కండా నాల్ ముదల్"తో తన నటనా జీవితాన్ని ప్రారంభించింది.తెలుగులో "శివ మనసులో శృతి" ద్వారా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో ఆమె నటనకు "సైమా ఉత్తమ తొలి చిత్ర నటి" అవార్డు కూడా వచ్చింది. రెజీనా తెలుగులో "రొటీన్ లవ్ స్టోరీ", "పిల్లా నువ్వు లేని జీవితం", "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్", "పవర్" వంటి సినిమాల్లో నటించి క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. తమిళంలో "కేడి బిల్లా కిల్లాడి రంగా", "మానగరం" వంటి చిత్రాల్లో ఆమె నటన ప్రశంసలు పొందింది.ఈ బ్యూటీ విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటుంది. "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్"లో సాంప్రదాయ అమ్మాయి, "జ్యో అచ్యుతానంద"లో స్టూడెంట్, "అ"లో డ్రగ్ అడిక్ట్ వంటి పాత్రల్లో తన సత్తా చాటింది. ఈ భామ బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టింది. 2019లో "ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా" చిత్రంతో హిందీలో ప్రవేశించింది. తాజాగా విడుదలైన సన్నీ డియోల్ "జాట్" చిత్రంలో కీలక పాత్రలో కనిపించింది. అలాగే, వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ తన సత్తా చాటుతుంది.గతంలో రెజీనా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆమె మాట్లాడుతూ.. ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో వచ్చిన "అ" సినిమా స్క్రిప్ట్ చెప్పారు. నాకు హీరోయిన్‌గా ఛాన్స్ ఇస్తే చేస్తా.. లేదా ఏదైనా కీలకమైన , నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్ర ఇస్తే చేస్తా అని చెప్పిందట.. అయితే హీరోయిన్ గా ఇప్పటికే కాజల్ ను ఫిక్స్ చేశాం అని చెప్పారు. సరే మరో బలమైన పాత్ర ఇవ్వమని అడిగాను. లేదంటే సినిమా చేయను అని తెగేసి చెప్పా అని తేలింది.దాంతో మీరా అనే పాత్ర ఇచ్చినట్టు తెలిపింది రెజీనా. అలాగే రీసెంట్ గా వచ్చిన జాట్ సినిమాలోనూ పోలీస్ ఆఫిసర్ పాత్ర చేయమన్నారు. నాకు భారతి రోల్ ఇస్తేనే చేస్తానన్నాను అని చెప్పా దాంతో నాకు ఆ పాత్ర ఇచ్చారు అని తెలిపింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం రెజీనా ఆచితూచి సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటూ అభిమానులను అలరిస్తుంది.


## 'రౌడీ జనార్ధన'లో బాలీవుడ్ భామ..

### లైగర్ బ్యూటీతో మళ్లీ రౌడీ స్టార్ రొమాన్స్?



టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ, క్రేజీ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రౌడీ జనార్ధన' గురించి రోజుకో ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. పక్కా గ్రామీణ నేపథ్యంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత, స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రంలో ఒక అదిరిపోయే మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారట. ఈ స్పెషల్ సాంగ్‌లో విజయ్ దేవరకొండతో కలిసి బాలీవుడ్ బ్యూటీ అనన్యా పాండే స్టెప్పులు వేయబోతున్నట్లు గట్టిగా వినిపిస్తోంది. గతంలో వీరిద్దరూ 'లైగర్' సినిమాలో కలిసి నటించిన సంగతి తెలిసిందే, ఒకవేళ ఈ వార్త నిజమైతే మరోసారి ఈ జోడి వెండితెరపై సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ స్పెషల్ సాంగ్ ఆఫర్‌కు అనన్య గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించేలా ఉంటాయని ఇన్సైడ్ టాక్. ముఖ్యంగా ఈ ఫ్లాష్ బ్యాక్‌లో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఊరమాస్ లుక్‌తో కనిపించబోతున్నాడట. ఇందులో వచ్చే యాక్షన్ సీక్వెన్సులు సినిమా మొత్తానికే మేజర్ హైలైట్‌గా నిలుస్తాయని చిత్ర యూనిట్ భావిస్తోంది. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ సినిమాలో సీనియర్ యాంగ్రీ యంగ్ మ్యాన్ రాజశేఖర్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్రతో పాటు లుక్ కూడా ఇప్పటివరకు మనం చూడని రీతిలో సరికొత్తగా, ఎంతో పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారట. మొత్తానికి భారీ తారాగణం, అదిరిపోయే యాక్షన్ ఎలిమెంట్స్, విలేజ్ బ్యాక్‌డ్రాప్ స్టోరీతో తెరకెక్కుతున్న 'రౌడీ జనార్దన' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులను సృష్టిస్తుందో చూడాలి.

## నా అలవాటు మార్చుకోను




ఎన్ఐఏ ఏజెంట్ వైష్ణవిగా 'స్పై' సినిమాతో తెలుగు చిత్రసీమకు పరిచయమైన నటి ఐశ్వర్య మేనన్. ఆ తరువాత 'భజే వాయు వేగమ్'తో మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ రెండు చిత్రాలూ ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా.. తనకంటూ ఫ్యాన్ ఫాలోయింగ్ పెంచుకున్నది ఈ భామ. ఒకవైపు కన్నడ, తమిళ్, మలయాళ సినిమాల్లో నటిస్తూనే మరోవైపు టాలీవుడ్‌లోనూ పాగావేసిన ఈ ముద్దుగుమ్మ ఈసారి 'నాగబంధం'తో రంగంలోకి దిగింది. ఈ సందర్భంగా ఆమె పంచుకున్న కార్‌వాన్ కబుర్లు ఇవి.మాది వాస్తవానికి కేరళం రాష్ట్రం. కొన్ని కారణాల వల్ల తమిళనాడులోని ఈరోడ్‌కు వలసొచ్చి అక్కడే స్థిరపడ్డాం. దీంతో నా బాల్యమంతా తమిళనాడులోనే గడిచింది. బీటెక్ వరకు చదువుకున్న నాకు సినిమాల్లో నటించాలనే బలమైన కోరిక ఉండేది. ఆ ఆసక్తితోనే అవకాశాల కోసం ప్రయత్నించి కోలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చాను. నాకు సంతోషం వచ్చినా, బాధ కలిగినా సోషల్‌మీడియాలో వ్యక్తం చేయడం అలవాటు. బాధకంటే ఆనందాన్నే ఎక్కువగా పంచుకుంటాను. ఓ సందర్భంలో నా ఫొటోలను పోస్ట్ చేయగా.. సినిమా ఆఫర్ల కోసం ఇలాంటి ఫొటోలు పోస్ట్ చేస్తుందని చాలామంది బ్యాడ్ కామెంట్లతో విమర్శించారు. నన్ను ద్వేషించేవారికి నేను చెప్పేది ఒక్కటే. మీరు ఎగతాళి చేసినా, విమర్శించినా ఒకరికోసం నా అలవాటును మార్చుకోను. ఇతర భాషల్లో చేస్తున్న సినిమాలు మంచి ఆదరణకు నోచుకుంటున్నాయి. అందుకే తెలుగులోనూ నా టాలెంట్‌ను నిరూపించుకునేందుకు వచ్చాను. గతంలో నేను నటించిన రెండు టాలీవుడ్ సినిమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోయాయి. అయినా కూడా ఇక్కడ నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తునే ఉన్నాను. విజయానికి ముందు ఓటమి ఎదురవుతుందంటారు కదా. ఆ పాలసీనే నేను ఫాలో అవుతున్నా. కచ్చితంగా సక్సెస్ అవుతా. 'నాగబంధం' ప్రేక్షకులను సరికొత్త ఆధ్యాత్మిక, అడ్వెంచర్ ప్రపంచంలోకి తీసుకెళ్లేలా రూపొందిన సినిమా. అనంత పద్మనాభస్వామి ఆలయం, అక్కడి నాగబంధం రహస్యాల కాన్సెప్ట్ ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. విరాట్ కర్ణ, నభా నటేశ్‌లతో కలిసి సినిమాలో నటించడం కొత్త అనుభూతినిచ్చింది.నా అభిమాన నటుడు మలయాళం మెగాస్టార్ మమ్ముట్టి గారే. ఆయనతో ఒక్కసారైనా నటించాలనే కోరిక ఉండేది. ఆ అవకాశం అంత త్వరగా వస్తుందని అస్సలు ఊహించలేదు. ఆయనతో కలిసి నటించడాన్ని నేను ఎన్నటికీ మరిచిపోలేను. మమ్ముట్టి నటించిన బజూకా సినిమాలో నేను కీలకపాత్ర పోషించాను. ఈ చిత్రంలో నా నటనకు మంచి మార్కులే పడ్డాయి.



## అది నిజం కాదు

తన సినిమాపై సాంఘిక మాధ్యమంలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై కథానాయిక కీర్తి సురేశ్ కౌంటరిచ్చింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా రూపొందుతున్న భారీ చిత్రంలో కీర్తి సురేశ్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె వెంకటేష్ జోడీగా నటిస్తున్నది. ఈ సినిమా.. మలయాళంలో 2024లో వచ్చిన 'గురువాయూర్ అంబలనాదయిల్' చిత్రం రీమేక్‌గా తెరకెక్కుతున్నదని ఇన్‌స్టాలో ఎవరో పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. దానికి కీర్తి సురేశ్ స్పందిస్తూ.. 'అందులో ఏ మాత్రం నిజం లేదు.ఇది కొత్త కథ. అందరూ మెచ్చే కథ' అంటూ కామెంట్ పెట్టింది. దీంతో వెంకీ, కల్యాణ్‌రామ్ చిత్రంపై వస్తున్న గాలి వార్తలకు చెక్ పెట్టినట్టయింది. రాయలసీమ నేపథ్యంలో, అనిల్ మార్క్ కామెడీతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతున్నది. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈచిత్రానికి 'జనవరి 13న విడుదల' అనే టైటిల్‌ని కూడా అనుకుంటున్నారు.

## NBK 111 డిసెంబర్‌లోనే?



అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. NBK 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇందులో బాలకృష్ణ పోషిస్తున్న పాత్రలో రెండు కోణాలుంటాయని, ఒక కోణంలో ఆయన అండర్‌వరల్డ్ డాన్‌గా కనిపిస్తే, మరో కోణంలో ఓ గొప్ప వంశానికి చెందిన వ్యక్తిగా, పేదలపాలిటి పెన్నిధిగా అగుపిస్తారట. ఇటీవలే ముంబైలో ఈ సినిమా భారీ షెడ్యూల్ పూర్తి చేసుకున్నది.ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. బాలకృష్ణ, మంచు మనోజ్, కాజల్ అగర్వాల్, శరత్‌కుమార్, నరేశ్ తదితరులు ఈ షూట్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయాలని చిత్ర నిర్మాత వెంకటసతీశ్ కిలారు ముందుగా భావించారు. అయితే.. నిర్మాణం త్వరగా పూర్తి కానుండటం, సంక్రాంతి సీజన్‌లో పోటీ అధికంగా ఉండటం తదితర కారణాల దృష్ట్యా ఒక నెల ముందే, అంటే డిసెంబర్‌లోనే సినిమా విడుదల చేయాలని ఆయన నిర్ణయించారట. డిజిటల్ భాగస్వాములు సైతం డిసెంబర్ రిలీజ్ వైపే మొగ్గు చూపారట. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది.

## మరో బయోపిక్‌తో అదరగొట్టనున్న ఆర్. మాధవన్..




'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' చిత్రంతో నటుడిగా, దర్శకుడిగా జాతీయ స్థాయిలో సంచలన విజయాన్ని అందుకున్న నటుడు ఆర్. మాధవన్, ఇప్పుడు మరో ప్రతిష్టాత్మక బయోపిక్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. భారతదేశపు గొప్ప ఆవిష్కర్త, ఇంజనీర్ మరియు 'ఇండియాస్ ఎడిసన్' అని పిలవబడే గోపాలస్వామి దొరైస్వామి నాయుడు (జి.డి. నాయుడు) బయోపిక్‌లో నటిస్తున్నాడు మాధవన్. 'G.D.N అనే టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది.బ్రిటిష్ ఇండియా నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. భారతదేశంలో మొట్టమొదటి ఎలక్ట్రిక్ మోటారును తయారు చేసిన జి.డి. నాయుడు.. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు, ఆవిష్కరణల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ట్రైలర్‌లో మాధవన్ యువకుడిగా మరియు వృద్ధుడిగా రెండు విభిన్న గెటప్‌లలో కనిపించి షాక్ ఇచ్చారు. ముఖ్యంగా వృద్ధుడి పాత్రలో ఆయనను గుర్తుపట్టలేనంతగా ప్రాస్థెటిక్ మేకప్‌తో అద్భుతంగా రూపాంతరం చెందారు. "బ్రిటిషర్లు భయపడ్డారు.. సొంత దేశస్థులు మర్చిపోయారు" అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది.వీశీజఱవం ఈ చిత్రంలో మాధవన్‌తో పాటు సత్యరాజ్, జయరామ్, ప్రియమణి, దుషారా విజయన్, వినయ్ రాయ్, తంబి రామయ్య వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి మాధవన్ స్వయంగా స్క్రీన్‌ప్లే అందించడం విశేషం. వర్గీస్ మూలన్ పిక్చర్స్ మరియు మాధవన్ స్వంత బ్యానర్ ట్రైకలర్ ఫిల్మ్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. '96' ఫేమ్ గోవింద్ వసంత అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అరవింద్ కమలనాథన్ సినిమాటోగ్రఫీ విజువల్స్ ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 17, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, Krishna, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450